ప్రజాశక్తి

సోమవారం 1 జులై 2024

5

పార్వతీపురం మన్యం

సిఎంను కలిసిన భూదేవి

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి ఆదివారం అమరావతిలో సిఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. చాలా ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న తోటపల్లి కాలువలు ఆధునీకరణ పూర్తి చేసేలా చూడాలని కోరారు. జంపరకోట జలాశయం పనులు పూర్తి చేయాలని, సవర భాషా వాలంటీర్ల సమస్య పరిష్కరించాలని కోరారు.

సిఎం చంద్రబాబుకు పూలమొక్క అందజేస్తున్న భూదేవి

డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు తిరుమల ప్రసాద్, జెసి నాయుడు, చిట్టి రమణారావు, సిరీన్, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు రవికుమార్, ప్రజాశక్తి మేనేజర్ కామినాయుడు, స్టాఫర్ రమేష్‌నాయుడు

ప్రజలను వైద్యులకు దూరం చేసే

ప్రభుత్వ విధానాలు మారాలి

- ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసి నాయుడు
- ప్రజాశక్తి ఆధ్వర్యాన డాక్టర్స్‌డే వేడుకలు
- ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు వైద్యులను దూరం చేసే ప్రభుత్వ విధానాలు మారాలని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసినాయుడు అన్నారు. వైద్యవృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ ఆదివారం తిరుమల-మెడికవర్ ఆస్పత్రి కాన్ఫరెన్సు హాలులో ఘనంగా జరిగింది. ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా వైద్య పితామహుడు బిసి రాయ్ చిత్రపటానికి డాక్టర్ జెసినాయుడు, డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ చిట్టి రమణారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులను ప్రజాశక్తి ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ జెసి నాయుడు మాట్లాడుతూ బెంగాల్‌కు చెందిన సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ (బిసి రాయ్) వైద్యులుగా, రాజకీయ నాయకులుగా ప్రజలకు సేవలు అందించారన్నారు. డాక్టర్‌గా ఉన్న ఆయనకు భారతరత్న ఇవ్వడం వైద్యులందరికీ గర్వకారణమన్నారు. మనిషి పుట్టిన నుంచి చనిపోయిన వరకు వైద్యులతో సంబంధం ఉంటుందన్నారు. వైద్యులను ఒత్తిడికి గురి చేయకుండా డాక్టర్, రోగులు సంబంధం గౌరవంగా సాగాలన్నారు. వైద్య వత్తిని, వైద్యులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు, డాక్టర్లకు మధ్య దూరం పెరుగుతోందన్నారు. అటువంటి విధానాలను ప్రభుత్వాలు విడనాలని కోరారు. మేథావులైన వైద్యులను ప్రభుత్వాలు వైద్యులను సలహాదారులుగా ఉంచాలన్నారు. టీచర్స్, గ్రాడ్యుయేట్ మాదిరిగా డాక్టర్లకు కూడా ఎమ్మెల్సీ పదవులు కేటాయించాలని కోరారు.

వెంకటరామా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ చిట్టి రమణారావు మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాశక్తి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తోందని, అందులో భాగంగా డాక్టర్స్‌డే నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాక్షించారు.

తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమలప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోను, , రాష్ట్రంలోను వైద్య రంగానికి. కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. సామాజిక దృక్పథంతో తమ ఆస్పత్రి ఆధ్వర్యాన 450 మెడికల్ క్యాంపులు నిర్వహించామని, బిపి, సుగర్, ఊబకాయంపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. కరోనా సమయంలో వైద్యులు ఎనలేని సేవలందించారని తెలిపారు. ముందు జాగ్రత్తలతోనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడు కోగల మన్నారు. కరోనా సమయంలో ప్రజలకు ప్రజాశక్తి, ప్రజా సంఘాలు చేసిన సేవలు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిరీన్ మాట్లాడుతూ తమ సీనియర్ వైద్యులే తమకు మార్గదర్శకమని అన్నారు. ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ వైద్యుల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల మధ్య సత్కరించడం ద్వారా వారు చేసిన సేవలకు గుర్తింపు ఉంటుందన్నారు. వైద్యులపై భౌతిక దాడులు సరికాదని, ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని గ్రహించాలని తెలిపారు. నాసిరకం మందులు, సరైన మిషనరీ లేకపోవడం వలన ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందడంలో ఆలస్యం అవుతుంది తప్ప వైద్యుల తప్పు కాదన్నారు. ప్రజలకు సేవలు చేసే వైద్యులను కాపాడుకోవాలన్నారు. ప్రజలకు సమీకృత ఆహారం అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. .

ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి నిత్యం ప్రజా దృక్పథంతో పనిచేస్తోందన్నారు. వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, విపత్తులు సంభవించే సమయంలో విరాళాలు సేకరించి ఇవ్వడం వంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సమాజ గమనానికి దిక్సూచి గా నడుస్తుందన్నారు. సేవా దృక్పథంతో ప్రజలకు తిండి, గూడు,గుడ్డ అవసరాన్ని పాలకులకు తెలియజేసే వార్తలు రాయడం జరుగుతుందన్నారు. ఈ ప్రయాణంలో ప్రజాశక్తికి సహకరిస్తున్న వైద్యులు, తదితర అన్ని వర్గాల వారికి ధన్యవాదాలు తెలిపారు. కె.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో ప్రజాశక్తి ముందుకు సాగుతోందన్నారు ప్రజాసమస్యలపై వార్తలు రాయడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా వైద్యుల సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక సంచికను తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి ఉద్యోగులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నీట్, యుజిసి నెట్ పరీక్ష పేపరు లీకులను నిరసిస్తూ

4న విద్యాసంస్థల బంద్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

నీట్, యుజిసి నెట్ పరీక్ష పేపరు లీకులను నిరసిస్తూ జులై 4న దేశ వ్యాప్తంగా తలపెట్టిన యూజీసీనెట్ పరీక్ష పేపర్ లీక్ ను నిరసిస్తూ 2024 జులై 4వ తేదీన దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వన్ నేషన్ - వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిందని విమర్శించారు. విద్యార్థుల విద్య భవిష్యత్తులో ప్రమాదంలో ఉందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. తీవ్ర అవకతకలకు, వ్యత్యాసాలతో జరిగిన నెట్ పిజి పరీక్షకు బాధ్యత వహించి వాయిదా వేసిందన్నారు. జూన్ 4న ప్రకటించిన నీట్ పరీక్షా ఫలితాలు పారదర్శకంగా లేవని పేపర్ లీక్ పై ఫిర్యాదులు వెల్లువెత్తాయన్నారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కేంద్రీకృత పరీక్షలు విద్యను ప్రైవేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందించి, ప్రోత్సహిస్తుందని, ఇది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్య పరిస్థితి కూడా దారుణంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం జరిగిందన్నారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ జూలై 4న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. విద్యార్థిలోకం బంద్‌లో పాల్గొని, తరగతులను బహిష్కరించి, ర్యాలీలు, నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి.ఉమాశంకర్, సంజీవ్, ఐబు, సురేష్, పి.రాజశేఖర్, సాంబ పాల్గొన్నారు.

పరజపాడులో సంచరిస్తున్న ఏనుగులు

మళ్లీ ఏనుగులు హల్‌చల్

- జొన్నతోట ధ్వంసం
- ఖాళీ చేసిన ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఏజెన్సీలో మళ్లీ ఏనుగులు హల్‌చల్ చేశాయి. ఇటీవల తోటపల్లి సమీపాన ఒక ఏనుగు అస్వస్థతతో మృతి చెందింది. అప్పటి నుండి మండలంలోని కుదమ, పరజపాడు పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారు జామున పరజపాడుకు చెందిన తంగుడు సింహాచలం అనే రైతు ధాన్యం నిల్వ ఉంచుకొన షెడ్‌ను విరగ్గొట్టి ధాన్యం బస్తాలను తినేశాయి. ఇదే గ్రామానికి చెందిన గుంట్రెడ్డి నాగభూషణరావుకు చెందిన జొన్న తోటను ధ్వంసం చేశాయి. రామకృష్ణ, సీతారాం నాయుడు కల్లాల్లో ధాన్యం బస్తాలను చిందరవందర చేశాయి. ఏనుగులు తరలించే ప్రయత్నాన్ని చేయలేని అధికారులు, కనీసం ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ట్రాకర్ల సంఖ్యలు పెంచి ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఏనుగు ధ్వంసం చేసిన ధాన్యం నిల్వ చేసిన షెడ్

ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలి

నేడు మండల కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల వద్ద ధర్నా తలపెట్టినట్టు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిక కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ ఉపాధి కూలీలు గత మూడు నెలలుగా ఎండలో రెండు పూటలా పనిచేస్తే సుమారు ఐదు వారాల బిల్లులు బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. గత ఆరు మాసాలుగా అటు వ్యవసాయ పనుల్లేక, ఇటు చేసిన ఉపాధి పనులకు కూలి రాక కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు పూటలా పనిచేయడం వల్ల కూలీలు రోజుకు పది కిలోమీటర్ల వరకు నడవాల్సి వస్తుందని అన్నారు. కావున కూలీల ఆరోగ్యం దెబ్బతింటుందని, వ్యవసాయ, ఇంటి పనులు చేసుకోవడానికి తీవ్ర ఆటంకంగా మారిందన్నారు. కాబట్టి రెండు పూటలా పనిని రద్దుచేసి ఒక్క పూట పని ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయంలో పని దినాలు భారీగా తగ్గాయని అందుకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకూలి రూ.400 తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలాగే మేట్లకు ప్రోత్సాహం ఐదు రూపాయలు ఇవ్వాలని, పారా, పలుగు తట్ట నిర్వహణకు డబ్బులు వేయాలని, మజ్జిగ, మంచినీరు కూలీలకు సరఫరా చేయాలని, మెడికల్ కిట్లు ఇవ్వాలని, టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సోమవారం ఎంపిడిఒ కార్యాలయాల వద్ద జరుగు ధర్నాలో వేతనదారులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కొత్తవలసలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల తరగతి గదులను, హాస్టల్ గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అందులో భాగంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, వసతి, భోజనం, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేలా చేస్తుందని, కావున ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని కోరారు. ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు సాధించాలని, అప్పుడే తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుతాయని అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన తాను మంత్రిగా వున్నానని, మీకు ఏ ఒక్క సమస్య ఉన్నా నేరుగా తనకు ఫిర్యాదుల పెట్టె ద్వారా తెలియజేయాలని తెలిపారు. అనంతరం వార్డెన్‌తో ఉపాధ్యాయుల పని తీరును, హాస్టల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వంటలను పరిశీలించారు. నాణ్యత గల భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుళ్ల వేణు, భాస్కరరావు, కోట లక్ష్మణ, చిన్న, శ్రీను పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

అమరావతి అభివృద్ధికి మొదటి అలవెన్సు

విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం

తనకు లభించే తొలినెల అలవెన్సులన్నింటితో కూడిన జీతాన్ని రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేస్తానని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం, అమరావతి రెండు ప్రాజెక్టులూ అభివృద్ధి జరగాలని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పదంలో నడిపించేందుకు వెంకటేశ్వర స్వామి సిఎంకు ఆశీస్సులు అందజేయాలని కోరుకున్నట్లు తెలిపారు.

డిఎస్‌సిలో ఉపాధ్యాయ పోస్టులు పెంచాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు వై.రాము డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ కార్యకర్తల సమావేశం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఎస్‌జిటి సంఖ్య తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, ఉమ్మడి జిల్లా నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గతప్రభుత్వం మూసివేసిన పాఠశాలలను తెరిపిస్తే ఈ పోస్టుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. గత ఏడేళ్లగా డిఎస్‌సి లేనందున వయోపరిమితిని 47సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సమావేశంలో జిల్లాలోని నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సిహెచ్ హరీష్, కో-కన్వీనర్‌గా బి.సతీష్, టి.నాయుడు, ఎం.గణేష్, సభ్యులుగా తిరుపతి,జయరాం, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

పదో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 10వ రోజుకి చేరాయి. జిందాల్ యాజమాన్యం లే ఆఫ్ పేరుతో కార్మికులను బయటికి నెట్టి నేటికి 45 రోజులు గడుస్తున్నా యాజమాన్యం కనీసక స్పందించుకోవడంపై కార్మికులు, కార్మికులు నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల పట్ల కనికరం చూపి, కంపెనీ తెరవాలని ఆందోళన వ్యక్తం చేశారు. 40 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను ఎటువంటి కారణం లేకుండా లే ఆఫ్ పేరుతో కంపెనీ బయట ఉంచడం విచారకరమన్నారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు నాయకత్వంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.

శిథిల వ్యవస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని ప్రభుత్వం
- ఇదీ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించిన రెండు దశాబ్దాలు దాటక ముందే శిథిలావస్థకు చేరాయి. దీంతో వీటిలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, పాఠాలు బోధిస్తున్నా ఉపాధ్యాయులు, అలాగే కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని చిట్టిపూడివలస, రేగులపాడు, బొడ్లపాడు, పనస నందివాడ తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికీ ఈ భవనాలు అక్కడక్కడ శ్లాబ్ పెచ్చులూడి దర్శమిస్తున్నాయి. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా శ్లాబ్ పై నుంచి వర్షం నీరు కిందకు జారడంతో గోడల బీటలు వారుతున్నాయి. పెద్దూరు, బొడ్లపాడు, కంబర వలస, సందిమానుగూడ, వీరఘట్టం తదితర గ్రామాల్లో పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికే బొడ్లపాడు గ్రామ పాఠశాల వెనుక గోడ కూలిపోవడంతో అద్దె భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఓ భాగంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం కొనసాగుతుంది. తూడిలో శిథిలమైన భవనంలో పశు వైద్యశాల కొనసాగుతుంది. ప్రతిసారి వర్షం పడినప్పుడు వర్షం నీరు కిందకి జారి పడడంతో పశువులు, మేకలు, తదితర జంతువులకు సంబంధించిన విలువైన మందులు పాడవుతున్నట్లు ఇన్‌ఛార్జి పశు వైద్యాధికారి పి.చైతన్య శంకర్ విలేకరుల వద్ద వాపోతున్నారు. ప్రస్తుత భవనాలు శిథిలావ్యవస్థలో చేరుకోవడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాద వార్త వినాల్సి వస్తుందని ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులు అటు ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలమైన భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిట్టి పూడివలసలో శిథిలమైన భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం

పాపంపేటలో కూలిపోయిన పాఠశాల వెనుక గోడ

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!



ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

సత్యంనాయుడు పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

వంజరాపును పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బలిజిపేట

అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు వంజరాపు సత్యం నాయుడును సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, శ్రామిక మహిళా నాయకులు వి.ఇందిర, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి పరామర్శించారు. సత్యంనాయుడు ఆరోగ్య పరిస్థితిని వారు అడిగి తెలుసుకున్నారు.

ఇంటి వద్దే పింఛన్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పింఛనుదారులందరికీ ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తామని, కావున సచివాలయాల వద్ద పింఛను కోసం వెళ్లొద్దని కమిషనర్ కె.శ్రీనివాసరావు లబ్ధిదారులకు సూచించారు. పట్టణంలోని 5,520 మంది వివిధ రకాల పింఛనుదారులకు రూ.3కోట్ల 77 లక్షల రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. కావున పింఛనుదారులు మీమీ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల వెళ్లకుండా మీ ఇంటి వద్దే ఉండాలని, మీకు పింఛన్ ఇచ్చేందుకు జులై1న ఉదయం 6 గంటలకే మీ సచివాలయాల పరిధిలో ఉన్న సెక్రటరీలు పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి పింఛనుదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరుగంటల నుంచే పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

జులై 1న ఉదయం ఆరు గంటల నుండే పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7415 పింఛన్లు ఉన్నాయని, వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించాలని అన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు వచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. పార్కులో మైదానంలో అందాలను కనువిందు చేసుకోవడానికి కుటుంబాలకు పర్యాటకులు వచ్చారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. చిన్నారులు కమాండో నెట్టు ఎక్కి ఆడుకున్నారు. యువతీ యువకులు యాంగింగ్ బ్రిడ్జి నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద దాన్సులు వేస్తూ కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ఆడలి యు పాయింట్ సందర్శించి సందడి చేశారు.


జయంత్‌రావును సన్మానిస్తున్న డిడి రుగ్మందయ్య

క్రమశిక్షణతో పని చేసే వారికి ప్రజాదరణ : డిడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

క్రమశిక్షణ, నిబద్ధత తో పనిచేసిన ఉపాధ్యాయులకు ఎప్పుడైనా ప్రజాదరణ ఉంటుందని ఐటిడిఎ డిడి రుగ్మందయ్య అన్నారు. మండలంలోని కొసంగి భద్ర గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పాలక జయంత్‌రావు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 36 ఏళ్ల పాటు సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించి ప్రజల హృదయాల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన అద్భుతమన్నారు. జయంత్‌రావు ఉపాధ్యాయ సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఎస్టీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలక దేవానంద్, కోర్ కమిటీ సభ్యులు, పలు పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

తొలగింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆక్రమణల తొలగింపుపై కాంగ్రెస్ హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని గల వరహాల గెడ్డ ఆక్రమణలను అధికారులు తొలగించడం పట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్తిన మోహనరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తొలగించిన ఆక్రమణలను మోహనరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పట్ట సింగ్ రవికుమార్, తీళ్ల గౌరీశంకర్, మిసాల సురేష్ తదితరులు పరిశీలించారు. అనంతరం మోహనరావు మాట్లాడుతూ గెడ్డ ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేశామని, ఈ మేరకు స్పందించిన రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన స్థలాన్ని గుర్తించి జెసిబితో ఆక్రమణలను తొలగించారన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు వారికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఎంత పొందాగా దోచుకున్నారో ప్రజలకు తెలియజేసిన అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంకా ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులకే డిప్యూటీ వార్డెన్, మేట్రిన్లకు విధులు అప్పగించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థానంలో డిప్యూటీ వార్డెన్, మేట్రిన్లకు విధులు అప్పగించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ కోరారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినా నేటికీ పలు పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్లు, మేట్రిన్లను నియమించే ప్రక్రియ అమలు చేయలేదన్నారు. గిరిజన సంక్షేమ విద్యా సంస్థలో ఎస్‌జిటి, పిఇటి ఉపాధ్యాయులకు విధులను అప్పగించాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

ప్రజాశక్తి - భామిని

ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జులై 1న పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయం సిబ్బందితో పాటు స్థానిక టిడిపి కార్యవర్గం పాల్గొనాలని ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవినాయుడు, మెడిబోయిన జగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల పింఛనను రూ.4వేలకు పెంచడమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం గడిచిన 3 నెలల పెన్షన్ కలిపి రూ.7వేలు జులై1న ఇంటివద్దే అందిస్తున్నామని తెలిపారు. పండగలా నిర్వహించే ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో టిడిపి కార్యవర్గం పాల్గొని పెన్షన్‌దారులకు ఇచ్చిన మాట ప్రకారం టిడిపి ప్రభుత్వం పెన్షన్ అందించిందని తెలపాలని తెలిపారు.

పట్టుకుంటున్నారు... వదిలేస్తున్నారు

ఇసుక అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు


సీజ్ చేసిన వెంటనే విడిచిపెట్టిన లారీ

ప్రజాశక్తి - కొమరాడ

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఒకవైపు రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూ ఆర్భాట ప్రచారాలు చేస్తున్నా అవి ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని మండలంలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను ఇలా పట్టుకొని అలా విడిచిపెట్టడంతో అధికారుల తీరు పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వారం రోజుల క్రితం జంఝావతి నది నుంచి ఒక చైన్ పొక్లైన్ ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించారు. ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతుల్లేవని గుర్తించి తవ్వకాలు చేస్తున్న చైన్ పొక్లైన్‌ను తీసుకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఇసుక తరలించిన లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు రెవెన్యూ అధికారులు అప్పగించారు. లారీని తరలించిన అనంతరం వంతెన పనులు చేస్తున్న రైల్వే కాంట్రాక్టర్ స్థానిక ఆర్పిఎఫ్ పోలీసులు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారులను సంప్రదించారు. ఎటువంటి అనుమతులు లేవు కాబట్టి లారీ యజమానిపై కేసు నమోదు చేశామని, కోర్టు నుంచి రిలీజ్ ఆర్డర్ తెచ్చుకోవాలని అప్పట్లో రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఒక్కరోజులోనే లారీని తిరిగి రైల్వే కాంట్రాక్టర్‌కు రెవెన్యూ అధికారులు అప్పగించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేసినట్లు నిర్ధారించిన అధికారులు పోలీస్ స్టేషన్‌కు లారీని అప్పగించినట్లు కూడా విలేకరులకు తెలిపారు. నది నుంచి ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు గతంలో ఇప్పుడు కూడా లేవని అప్పట్లో రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు వంతెనలు ఉన్న ప్రదేశంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు తవ్వకూడదని ఎప్పటి నుంచో హెచ్చరికలు జారీ చేసి తవ్వకాలు నిషేధించారు. మరి ఇప్పుడు రైల్వే కాంట్రాక్టర్లు ఇసుక తవ్వకాలు ఎలా జరిపారో రెవెన్యూ అధికారులకే తెలియాల్సి ఉంది. లారీని పట్టుకొని కేసు నమోదు చేసి ఒక్క రోజులోనే అనుమతులు ఉన్నాయంటూ తిరిగి రెవెన్యూ అధికారులు లారీని విడిచిపెట్టడం చూస్తే రైల్వే కాంట్రాక్టర్లతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే చిన్న చిన్న ఇసుక ట్రాక్టర్ సొంత పనులు కోసం ఇసుకను తరలిస్తే వారిపై కేసులు నమోదు చేసి సుమారు నెలరోజులకు పైగానే ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టు నుంచి రిలీజ్ అయిన తెస్తే తప్ప విడిచి పెట్టే పరిస్థితి లేదు. అదే పెద్ద పెద్ద కాంట్రాక్టర్లైతే భారీ ఎత్తులో ముడుపులు చెల్లిస్తారు కాబట్టి వెంటనే కేసులు లేకుండా వాహనాలను తిరిగి అప్పగిస్తారని ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా అమాయకులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసి కోర్టుల చుట్టూ తిప్పి నెలరోజుల వరకు వాహనాలు అందే పరిస్థితి ఉండదని ట్రాక్టర్ల డ్రైవర్లు అంటున్నారు. అదే పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు అయితే కేసులు లేకుండా వారితో మంతనాలు జరిపి వాహనాలను తిరిగి ఎలాగా అప్పగించారని ట్రాక్టర్ డ్రైవర్లు యజమానులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా పట్టుకున్న లారీని పోలీస్ స్టేషన్ వద్ద పెట్టినప్పటికీ తిరిగి ఎటువంటి ధ్రువపత్రాలు చూపించకపోయినా ఎలా విడిచిపెట్టారో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అధికారులు చేస్తున్న తప్పుడు పనులపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ రమేష్ విలేకరులను ప్రశ్నించగా రైల్వేశాఖ నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతులు చూపించారని చెప్పడం విడ్డూరం. అదేవిధంగా శనివారం రాత్రి స్వామినాయుడు వలస రైల్వే గేట్ సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును తహశీల్దార్ పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం శనివారం తిరిగి పోలీస్ స్టేషన్ నుంచి ఇటువంటి కేసు నమోదు లేకుండా తీసుకువెళుతున్నట్టు సమాచారం. ఇలా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకోవడం, వెంటనే విడిచి పెట్టడంపై మండలంలో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వాహనాలు పట్టుకొని పోలీస్ స్టేషన్లో పెట్టడం, విడిపించడంపై ఎస్సై కె.నీలకంఠం వద్ద ప్రజాశక్తి ప్రశ్నించగా రెవెన్యూ కార్యాలయం నుంచి వాహనాలను విడిచిపెట్టమని ఆదేశాలు వచ్చిన తర్వాత వాహనాలను పంపించేస్తున్నామని తెలిపారు.

కందులపదంలో నేడు మంత్రి పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కందులపదంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నారు. పింఛన్ల పంపిణీని మండలంలోని అన్ని సచివాలయం సిబ్బందితో పంపిణీచేస్తామని ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ తెలిపారు.

నేత్ర వైద్యాధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నగేష్ రెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆంధ్ర ప్రదేశ్ ప్రోగ్రెసివ్ ఆప్తాలమిక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడుగా డాక్టర్ రోణంకి వెంకటరమణ (శ్రీకాకుళం జిల్లా), కార్యదర్శిగా డాక్టర్ జీరు నగేష్ రెడ్డి (పార్వతీపురం మన్యం జిల్లా), ఉపాధ్యక్షులుగా డాక్టర్ మనీష్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా సత్యనారాయణ, కోశాధికారిగా రామచంద్రరావు, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ మూర్తి, సుధాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా హెరాల్డ్, ఇందిరా, రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయంద్ర

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని పద్మశ్రీ థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షో రూమ్‌ను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనెజింగ్ డైరక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ పార్వతీపురం, రాయగడ ప్రాంత వినియోగదారులకు మరింత చేరువగా తమ కొత్త షోరూమును ఇక్కడ ప్రారంభిస్తున్నామన్నారు. విన్నూతమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాల ఎక్స్ఛేంజ్‌పై పై ప్లాట్ 6శాతం తరుగుకే ఆభరణాలు అందిస్తున్నామని తెలిపారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరులేదని, వినియోగదారుల తరుపున జిఎస్టి కూడా తామే చెల్లిస్తామని అన్నారు. అలాగే కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.10వేలు వరకు తగ్గింపు ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరు కాగా, విశాఖకు చెందిన జామి నగేశ్ మొదటి కొనుగోలును చేశారు. కార్యక్రమంలో వైశ్యరాజు ఫల్గుణరాజు, వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజు, వెంకటేశ్వర జ్యూయలర్స్ ప్రతినిధులు, బెలగాం జయబాబు, ఇండుపూరు గోపాలరావు, ఇందుపూరు గున్నేశ్వరరావు, గుంపస్వామి, బరాటం వెంకటరమణ మూర్తి, జల్లు రామక్రిష్ణ పాల్గొన్నారు.

జిఒ 3ను పునరుద్ధరించండి

గిరిజన సంక్షేమశాఖా మంత్రికి ఆదివాసీ ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కాల్సిన జిఒ 3ను పునరుద్ధరించాలని, గిరిజన యువత కోసం ప్రత్యేక డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి నివాసంలో ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జన్ని పైడిరాజు, కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కలిసి సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. సాలూరు పట్టణంలో గిరిజన సామాజిక భవనం నిర్మించాలని కోరారు. డిగ్రీ పాసైన గిరిజన యువత కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికైన వారికి ఐఎఎస్, ఐపిఎస్ శిక్షణ నిర్వహించాలని కోరారు. గిరిజన ఆవాస గ్రామంలో ప్రాథమిక పాఠశాల వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజనులనే సిఆర్‌టిలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కాస్మోటిక్స్ పంపిణీ చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు.


శివున్నాయుడు సన్మానసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయంద్ర

సేవ చేసే వారికే గుర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

సేవలు చేసే వారికే గుర్తింపు ఉంటుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరడానా శివున్నాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవ చేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అందించే వారికి ప్రత్యేకమైన గుర్తింపు లభించడమే కాకుండా గౌరవం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం కోసం పాటుపడే వారికి ఈ ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. వృత్తిలో రాజీ లేకుండా అనేక మందిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన వారు ఉన్నారన్నారు. అనంతరం శివున్నాయుడు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూరిదేముడు, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, సర్పంచ్ ఆరుద్రమ్మ, గ్రామ పెద్దలు గాజాబ్ శ్రీను, తాతబాబు, వెంకటరమణతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధిహామీ వేతనదారులకు పెండింగ్లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బి కెఎంయు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సూరయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో సుమారు ఆరు వారాలకు పైగా వేతనదారులకు పనులకు సంబంధించిన బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. చట్టప్రకారంగా పనిచేసిన 14 రోజుల్లో బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ వేతనదారులకు సక్రమంగా బిల్లులు అందడంలేదన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి వేతనదారులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికులకు అనుకూల సమయాలు ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

గుంటూరు నుండి రాయగడ వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలుతో పాటు మరికొన్ని రైళ్ల సమయంతో పొడిగించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని గుమడ వద్ద ఆదివారం రైళ్ల సమయాన్ని మార్చాలని, అలాగే పొడిగించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రయాణికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గత రెండు నెలలుగా గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేయడంతో పాటు మళ్లీ ఆగస్టు వరకు కూడా రద్దు చేశామని రైల్వే అధికారులు ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ రైలు పేదల రైలుగా ఉందని, ప్రతిరోజు వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు, వలస కూలీలు రాజమండ్రి, విశాఖపట్నం, గుంటూరు, ఏలూరు, విజయవాడ వెళ్లేందుకు, అలాగే విద్య, వైద్య కోసం తక్కువ ఛార్జీలతో వెళ్లేందుకు ఎంతో ఉపయోగంగా ఉండేదన్నారు. ఈ రైలు రద్దుతో ప్రయాణికులు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందన్నారు. కావున వెంటనే గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలును పునరుద్ధరించాలని, గతంలో విశాఖపట్నం నుండి రాయపూర్ వెళ్లే ట్రైన్‌ను కొరాపుట్ వెళ్లే ట్రైన్‌కు లింక్ చేయడం వల్ల ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున విశాఖ నుండి రాయపూర్ వెళ్లే ఈ ట్రైన్‌ను ఉదయం 4గంటలకు బయలుదేరేలా చూడాలని కోరారు. అలాగే విశాఖపట్నం నుండి విజయనగరం వస్తున్న మేము ట్రైన్‌ను కూడా రాయగడ వరకు పొడిగించి అన్ని విధాలా ప్రయాణికులకు ఆదుకోవాలని కోరారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రయాణికులు, సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

మృతి చెందిన కలియ దాసు

స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి నదిలో స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. శనివారం సాయంత్రం రబ్బర్ డాం పక్కనే ఉన్న క్వారీలో పనిచేస్తున్న బొండపల్లి మండలం గరుడబిల్లికి చెందిన దాసు కలియ (60) నదిలో స్నానానికి దిగి గల్లంతయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బంజు కుప్ప క్వారీలో పనిచేస్తూ స్నానం కోసం దిగడంతో నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కొట్టుకుపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రబ్బర్ డ్యామ్‌కు 100 మీటర్ల దూరంలో మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - పాలకొండ

కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును శ్రీకాకుళంలో టిడిపి శ్రేణులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నాయి. పాలకొండ నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని టిడిపి నాయకులు మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సామంతుల దామోదర్‌రావు, జంపరకోట మాజీ సర్పంచ్ పైల సత్తిబాబు, మజ్జి జయశంకర్, ఎన్ని బాబ్జీ, తదితరులు ఉన్నారు.

కృష్ణమూర్తికి ఘన సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి చేస్తున్న సేవలకు మెచ్చి విశ్వ కళా పరిషత్, వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ, నా ఊరు విజయనగరం, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, తిలక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయనకు గజమాలతో శాలువా కప్పి సత్కరించారు. విజయనగరంలోని యూత్ హాస్టల్లో ఆదివారం ఈ సన్మానం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడ్వకేట్, జాతీయ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఫోరెస్ రాజు విచ్చేశారు. విశ్వ కళా పరిషత్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింతలపూడి త్రినాధరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి సుభద్రాదేవి, కందాళ సాయిబాబా, టి.మహేశ్వరరావు, రామకృష్ణ, కె.ఎర్రి నాయుడు, మానవహక్కుల జిల్లా అధ్యక్షులు ఎస్.అచ్చిరెడ్డి, పాల్గొన్నారు..

కృష్ణమూర్తిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ

గూగుల్ మ్యాప్ తెచ్చిన తంటా

ప్రజాశక్తి -భామిని

మండలంలోని మణిగ నుంచి భామిని వచ్చే గాట్ రోడ్డు మలుపు వద్ద బొగ్గులతో వస్తున్న లారీ కదిలేందుకు వీలు లేకుండా 24 గంటలుగా నిలిచిపోయింది. లారీ డ్రైవర్ ఈ రూట్ ఎందుకు వచ్చావని స్థానికులు ప్రశ్నించగా గుణుపూర్ నుండి భామిని, కొత్తూరు వెళ్లేందుకు గూగుల్ మ్యాప్ ఉపయోగిస్తే, ఈ మార్గం చూపించిందని, అందుకే ఇలా లారీ తెచ్చానని తెలిపాడు. ప్రస్తుతం లారీ మణిగ గాట్ రోడ్డు మలుపు ఇరుకైనా రోడ్డులో నిలిచిపోవడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది.

ఎంటిఎస్ ఉపాధ్యాయుల నూతన జిల్లా కార్యవర్గం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మన్యం జిల్లా 1998 ఎంటిఎస్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం ఏర్పాటు జరిగింది. ఆదివారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాల ఆవరణలో గౌరవ అధ్యక్షులు కె.రమేష్, బి.కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా నగిరెడ్డి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆర్‌వి ప్రసాద్, ఎస్.వెంకటనాయుడు, కార్యదర్శిగా కొల్లి రామకృష్ణ, ఉప కార్యదర్శిగా కర్రి అప్పలనాయుడు కోశాధికారిగా రామచంద్రరావు, సంయుక్త కోశాధికారిగా బొత్స శంకర్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్సును ఢీకొన్నలారీ ; ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాసాపేట దగ్గరలో ఆదివారం సాయంత్రం బొబ్బిలి నుండి పార్వతీపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆర్‌టిసి బస్సు డ్రైవర్, నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పార్వతీపురం డిపోకు చెందిన డ్రైవర్ కె.దండాసికి, బస్ లో ప్రయాణికులైన పెదపెంకికి చెందిన మరిశర్ల పైడితల్లితో పాటు ఒకే కుటుంబానికి చెందిన ఎం.భవాని, ఎం.సాయిగణేష్, విజయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే పార్వతీపురం జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. ప్రయాణికులను దింపి బస్సునెమ్మదిగా వెళ్తున్న సమయంలో వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొన్న సమయంలో బస్సులో డ్రైవర్‌కు వెనుక ఉన్న అద్దంతగిలి గాయాలు కాగా, ప్రయాణికులకు బస్‌లో ఉన్న రాడ్స్ తగిలి గాయాలయ్యాయి. సంఘటన తెలుసుకున్న వెంటనే స్థానిక పోలీసులతో పాటు ఆర్టీసి అధికారులు కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు తెలిపారు. ఇదిఇలా ఉండగా ప్రమాదం జరిగిన తర్వాత బలిజపేట నుండి పార్వతీపురం వస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అక్కడ ఆగి ప్రమాదం జరిగిన తీరును కండక్టర్‌ను, తోటి ప్రయాణికుల నుంచి తెలుసుకొని గాయాలు తగిలిన వారికి మెరుగైన వైద్య సదుపాయాన్ని అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు

లారీ ఢీకొని మహిళకు గాయాలు

సీతానగరం: స్థానిక హనుమాన్ కూడలి వద్ద ఆదివారం సాయంత్రం లారీ ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు బలిజిపేట మండలం అజ్జాడకు చెందిన కల్యాణిగా గుర్తించారు. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీతానగరం పోలీసులు తెలిపారు.